సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం। 4। ఆగస్టు। 2025



30 గ్రాములకు తగ్గకుండా ప్రసాదం

యాదగిరి క్షేత్రానికి వచ్చే భక్తులకు 30 గ్రాములకు తగ్గకుండా ఉచిత ప్రసాదం అందించాలని ఈఓ సూచించారు. - 8లో



సాగర్‌కు పర్యాటకుల తాకిడి

కృష్ణమ్మ పరవళ్లను వీక్షించేందుకు ఆదివారం నాగార్జునసాగర్‌కు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. - 8లో



ప్రహరీలు లేక పరేషాన్

యాదగిరిగుట్ట మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ కరువైంది. - 9లో

న్యూస్‌రీల్

పలు ప్రాంతాల్లో వర్షం

భువనగిరి, భూదాన్‌పోచంపల్లి: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చౌటుప్పల్‌లో 59 మి.మీ, వలిగొండ మండలం వర్కట్‌పల్లిలో 58 మి.మీ, భువనగిరిలో 6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై గంటన్నరపాటు మోస్తరు వర్షం కురిసింది. దాంతో ప్రజలకు కాస్త ఉపశమనం కల్గింది. ఎండిపోతున్న మెట్టపంటలకు జీవం వచ్చినట్టయ్యింది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

రాజాపేట : మార్నింగ్‌వాక్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం రాజాపేట మండల కేంద్రంలో పర్యటించారు. వివిధ వార్డుల్లో తిరిగి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇసుక, సిమెంట్, స్టీల్ ఏ రేట్లకు లభిస్తున్నాయని ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. లబ్ధిదారులకు సహకరించాని అధికారులకు స్పష్టం చేశారు. రాజాపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని, చెరువల ద్వారా సాగు నీరు అందించాలని బీజేపీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విఠల్ నాయక్, నాయకులు పెంటయ్యగౌడ్, ఇంజ నరేష్, సురేందర్, శ్రీశైలం, కేదారి, లక్ష్మణ్, శ్రవణ్, రమేష్ పాల్గొన్నారు.

7న భువనగిరికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అశోక్

భువనగిరి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఈనెల 7న భువనగిరిలో పర్యటించనున్నారని పార్టీ జిల్లా ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. ఆదివారం భువనగిరిలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత బస్టాండ్ నుంచి వినాయకచౌరస్తా మీదుగా ఎంఎస్ఆర్ గార్డెన్ వరకు రోడ్ షో ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, పోతంశెట్టి రవీందర్, కర్నాటి ధనుంజయ్య, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, నర్ల నర్సింగ్ రావు, చందా మహేందర్ గుప్తా, శివకుమార్, పట్నం శ్రీనివాస్, అచ్చయ్య, పట్టణ, మండల కమిటీ అధ్యక్షుడు రత్నపురం బలరాం, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే



స్నేహితుల దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్‌లోని విద్యానగర్ కాలనీలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని, కొత్త గాజులు వేసుకుని ఐక్యత చాటుతున్న మహిళలు

• సత్తా చాటి.. ప్రతిష్ట పెంచి



వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్‌లు పొందిన ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు

ఆలేరు: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌సీసీ విద్యార్థులకు వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేడెట్‌లు ప్రతిభ కనబరిచారు. 6వ కంబైన్డ్ ట్రైనింగ్ క్యాంప్ (రిపబ్లిక్ డే సెలక్షన్స్) క్యాంపులో డ్రిల్, పరేడ్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ అవేర్‌నెస్ జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత, ఫీల్డ్ క్రాఫ్ట్, బాటిల్ క్రాఫ్ట్, శారీరక తదితర పోటీల్లో సత్తా చాటారు. వీరికి తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ వరంగల్ అధికారులు చౌరసియా, అజయ్‌కదమ్, దీపక్, నిఖిలేష్, సందీప్ చేతుల మీదుగా ఆదివారం సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు దూడల వెంకటేష్, సదానందం, వాసు, కేడెట్లు, భార్గవి, వరుణ్, భానుప్రసాద్, రేచల్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో బంధువై..

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అండగా 108

- బాధితులు ఫోన్ చేస్తే చాలు.. క్షణాల్లో సంఘటనా స్థలానికి
- చికిత్స చేయడంతో పాటు సకాలంలో ఆస్పత్రులకు తరలింపు
- జిల్లా పరిధిలో 12 అంబులెన్స్‌లు
- 2024-25లో 22,492 మందికి సేవలు
- ప్రతి వాహనంలో పైలట్, ఈఎంటీ
- అందుబాటులో ఆధునిక వైద్య పరికరాలు, ప్రథమ చికిత్స
- సేవలందిస్తున్న 125 మంది సిబ్బంది
- జీపీఎస్ సహాయంతో సేవలు మరింత మెరుగు



క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందిస్తున్న ఈఎంటీ



మోత్కూరు : సూర్యాపేట జిల్లా శాలిగౌరారం మండలం చెరువుమాదారం గ్రామానికి చెందిన చరణ్ మోత్కూరు మండలం పొలడుగు గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి పండుగకు వచ్చాడు. తిరుగుప్రయాణంలో ఎదురుగా వచ్చిన ఆటో అతని ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో చరణ్ కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులిచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్ 15 నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకుంది. ఈఎంటీ, పైలట్ బాధితుడికి అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందిస్తూ ఆస్పత్రికి చేర్చారు.. ఇలా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని సకాలంలో ఆస్పత్రులకు చేరుస్తూ పునర్జన్మ ప్రసాదిస్తున్నాయి.. 108 అంబులెన్స్‌లు.

వేలాది మందికి పునర్జన్మ

జిల్లాలోని మోత్కూరు, గుండాల, వలిగొండ, రామన్నపేట, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, తుర్కపల్లి, భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు కేంద్రాల పరిధిలో 108 అంబులెన్స్‌లు 12 ఉన్నాయి. ఇవి పల్లెలు, పట్టణాలు, మారుమూల ప్రాంతాల్లో నిరంతర సేవలందిస్తున్నాయి. 2024-25 సంవత్సరంలో మొత్తం 22,492 మందికి సేవలందించాయి. అందులో మెడికల్ 15,562, గర్భిణులు 1,980, రోడ్డు ప్రమాద బాధితులు 2,915, గుండెనొప్పి 892, శ్వాస సంబంధ కేసులు 1,107 మందికి ప్రాథమిక చికిత్స అందించి సంఘటన స్థలం నుంచి సకాలంలో ఆస్పత్రులకు చేర్చాయి.

2024-25లో అందించిన సేవలు

మెడికల్‌కు సంబంధించి 15,562	గర్భిణులు 1,980
రోడ్డు ప్రమాద బాధితులు 2,915	గుండెనొప్పి 892
శ్వాస సంబంధ కేసులు 1,107	

అంబులెన్స్‌లో సౌకర్యాలు ఇవీ..

అత్యవసర రోగులు, బాధితులకు చికిత్స అందిస్తూ ఆస్పత్రికి చేర్చడానికి 108 అంబులెన్స్‌లో అవసరమైన అన్నిరకాల వైద్యపరికరాలు ఉంటాయి. గ్లూకోమీటర్, బీపీ ఆపరేటర్, థర్మామీటర్, క్రిమిసంహారక, ఇతర మందులు తాగిన వారికి చికిత్స అందించడానికి సక్షన్ ఆపరేటర్, గుండెపోటు బాధితులకు షాకింగ్ చికిత్స అందించడానికి కార్డియాక్ ఏఈడీ యంత్రం, ఆక్సీజన్, స్ట్రెచర్, కాలుచేతులు విరిగి లేవలేనివారికి స్కూప్ స్ట్రెచర్, ప్రమాదంలో వెన్నుపూస విరిగి కదలలేని వారికి స్పైన్ బోర్డు తదితర వైద్య పరికరాలు ఉంటాయి. ఆస్పత్రిలో చేర్చేవరకు ఆ పరికరాలను ఉపయోగిస్తూ రోగులకు ఈఎంటీలు ప్రాథమిక చికిత్స అందిస్తారు.

నిమిషాల్లో ఘటనా స్థలానికి

కుయ్..కుయ్‌మనే చప్పుడు వినిపించగానే దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకొస్తారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 108 అంబులెన్స్ పథకం ప్రవేశపెట్టారు. 108 కాల్ నుంచి ఎవరైనా ఆపదలో ఉన్నామని తెలియజేయగానే అంబులెన్స్ శరవేగంగా బయలుదేరుతుంది. పట్టణమైతే 15 నిమిషాలు, పల్లె అయితే 20 నిమిషాలు.. మారుమూల ప్రాంతానికి అరగంటలోనే చేరుకుని బాధితులను ఆస్పత్రులకు చేరుస్తాయి. పేదోడి నుంచి కోటీశ్వరుడి వరకు ఎంతోమంది ప్రాణాలను కాపాడిన అపరసంజీవనిగా పేరొందింది.

శిక్షణ పొందిన ఈఎంటీలు, పైలట్‌లు

బాధితులు ఎవరైనా 108కి కాల్ చేసి ఆపదలో ఉన్నామని తెలియజేస్తే దగ్గరలోని అంబులెన్స్‌ను సంఘటన స్థలానికి 20 నిమిషాల్లోనే పంపుతారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులకు అంబులెన్స్‌లోనే ప్రాథమిక వైద్యం అందిస్తారు. తుదపరి వైద్యం కోసం సకాలంలో ఆస్పత్రిలో చేర్చుతారు. ఇందుకోసం అంబులెన్స్‌లో శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ), ఎంతవేగంతోనైనా వాహనాన్ని సురక్షితంగా నడిపించగల పైలట్ ఉంటాడు. జిల్లాలో ఈఎంటీలు, పైలట్‌లు 125 మంది ఉన్నారు.

తల్లి, బిడ్డను కాపాడారు



నా రెండవ కాన్పుకు ఐదు నెలల క్రితం పురిటి నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాం. కొద్ది సమయంలోనే అంబులెన్స్ మా ఇంటికి వచ్చింది. నన్ను జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవం జరిగింది. అంబులెన్స్ సిబ్బంది ప్రసవ చికిత్సకు సహకరించారు. సకాలంలో అంబులెన్సు చేరుకోవడంతో పాటు చికిత్స అందించి తల్లి, బిడ్డల ప్రాణాలు నిలిపారు. వారి సేవలు అభినందనీయం.

– అర్చన, గుండాల

సేవాదృక్పథంతో ఆలోచిస్తా..



108 అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించా. ఈఎంటీ ఉద్యోగాన్ని సేవాదృక్పథంగా భావిస్తా. నేను పని చేసిన ప్రాంతాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందికి ప్రాథమిక వైద్యం అందించి సకాలంలో ఆస్పత్రిలో చేర్చి వారి ప్రాణాలు కాపాడాం. ప్రజల ప్రాణాలు కాపాడటం నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది.

– తొంట భాస్కర్, 108 అంబులెన్స్ ఈఎంటీ

నిమిషాల్లోనే వెళ్తాం



108 నుంచి ఎవరైనా కాల్ చేయగానే వెంటనే బయలుదేరుతాం. నిమిషాల వ్యవధిలోనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు అంబులెన్సులోనే ప్రథమ చికిత్స అందిస్తూ వేగంగా ఆస్పత్రికి చేర్చే ప్రయత్నం చేస్తాం. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు బాధితులను తరలిస్తా. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని సకాలంలో ఆస్పత్రిలో చేర్చి వారి ప్రాణాలు దక్కితే మాకు కూడా పేరుటుంది.

– లాథినేని సోమేశ్వర్, 108 అంబులెన్స్ పైలట్

యాదగిరి క్షేత్రానికి ఉత్సవ శోభ

- నేటి నుంచి పవిత్రోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో సిద్ధం చేసిన యాగశాల

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం పవిత్రోత్సవాలకు సిద్ధమైంది. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. యాగ నిర్వహణకు ప్రథమ ప్రాకార మండపంలో యాగశాల సిద్ధం చేశారు.

విష్వక్సేన ఆరాధనతో ఉత్సవాలకు శ్రీకారం

సోమవారం సాయంత్రం విష్వక్సేన ఆరాధనతో అర్చకులు పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ వేడుకతో పాటు రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల రెండో రోజు ఉదయం నవకలశ అభిషేకాలు, నిత్య మూర్తి, మూలమంత్ర, శ్రీనృసింహ, సుదర్శన, దేవతా హవనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి విమాన గోపురానికి పూజలు చేసి, శ్రీసుదర్శన చక్రానికి పవిత్ర మాలలు ధరింపజేస్తారు. చివరిరోజు బుధవారం మహా పూర్ణాహుతి నిర్వహించి, స్వామి వారికి పవిత్రమాలలను సమర్పించడంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

సర్వదోషాలు తొలగిపోవడానికి..

ఏటా శ్రావణమాసంలో శ్రీస్వామి వారికి పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయంలో సంవత్సరం పొడవునా జరిగే నిత్యారాధనలు, వివిధ రకాల ఉత్సవాల్లో ఏమైనా దోషాలు జరిగినట్లయితే వాటి ప్రాయశ్చితార్థం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. పవిత్రోత్సవాల్లో నాలుగు చతుర్వేద పారాయణాలు, మూల మంత్ర హవన పూజలు నిర్వహిస్తారు. వివిధ రంగుల్లోని పట్టు, నూలు పోగులకు ప్రత్యేక పూజలు, వేద మంత్రాల మధ్య పవిత్రాలను తయారు చేస్తారు. ఉత్సవాల్లో చివరి రోజు పవిత్రాలను శ్రీస్వామి వారికి సమర్పిస్తే సర్వదోషాలు తొలగిపోతాయని విశ్వాసమని అర్చకులు వెల్లడించారు. మొదటగా గర్భాలయంలోని మూలవర్యులు, ఉత్సవ మూర్తులకు పవిత్రాలను ధరింపజేస్తారు.

ఆర్జిత సేవలు రద్దు

పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో 5, 6 తేదీల్లో శ్రీసుదర్శన నారసింహ హోమం, శాశ్వత, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, లక్ష పుష్పార్చన రద్దు చేశారు. 7వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

దోష నివారణకే పవిత్రోత్సవాలు



ఆలయంలో నిత్యారాధనలతో పాటు వివిధ రకాల ఉత్సవాలు జరుగుతుంటాయి. ఉత్సవాల్లో మనకు తెలియకుండానే లోపాలు జరుగుతుంటాయి. వాటి నివారణకు ప్రాయశ్చిత్తంగా ఏటా శ్రావణమాసంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తాం. ఉత్సవాలు ముగిసే వరకు రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో చతుర్వేద పారాయణంతో పాటు మూలమంత్రాలు, నారసింహ హవనం జరిపిస్తాం. ప్రత్యేక పూజలు చేసిన పట్టు, నూలు పోగులను స్వామి వారికి సమర్పిస్తాం.

– కాందూరి వెంకటాచార్యులు, ప్రధానార్చకుడు

నారసింహుడికి సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి క్షేత్రంలో కోలాహలం నెలకొంది. నిత్యారాధనలు, భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయం, పరిసరాలు సందడిగా మారాయి. వేకుజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. ఆ తరువాత గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తును అభిషేకం, సహస్ర నామార్చనలతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండిజోడు సేవను ఆలయంలో భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామికి శయనోత్సవం నిర్వహించి ఆలయ ద్వారబంధనం చేశారు.

ప్రమాదమని తెలుసు.. ఎందుకో అలుసు

శిథిలావస్థలో ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

- కుంగిన పునాది, గోడలకు పగుళ్లు, పెచ్చులూడుతున్న స్లాబ్
- కాలేజీని సందర్శించిన ఆర్‌అండ్‌బీ ఈఈ
- తరగతుల నిర్వహణకు భవనం పనికిరాదని విద్యాశాఖకు నివేదిక
- ముప్పని తెలిసినా వీడని నిర్లక్ష్యం



శిథిలావస్థకు చేరిన ఆలేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆలేరు: ఆలేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. పునాది క్రమంగా కుంగిపోతోంది. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు కూలుతుందో తెలియక విద్యార్థులు, అధ్యాపకులు క్షణక్షణం భయంభయంగా గడుపుతున్నారు. ఇక వర్షాలకు లీకేజీలు ఏర్పడటంతో భవనం మరింత ప్రమాదకరంగా మారింది. శిథిల భవనంతో ముప్పు ఉందని, కళాశాలకు పనికిరాదని ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదిక ఇచ్చినా విద్యాశాఖ అధికారులు అలసత్వం వీడటం లేదు.

1993లో నిర్మాణం

జూనియర్ కళాశాల భవనాన్ని 1993లో తహసీల్దార్ కార్యాలయం పక్కన నిర్మించారు. దాదాపు 32 ఏళ్లుగా ఈ భవనంలో కళాశాల కొనసాగుతోంది. అయితే స్వల్పకాలానికే భవనం శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి స్థలం ఫిట్‌గా లేకపోవడంతో భవనం స్ట్రక్చర్ మొత్తం బలహీన పడింది. తరగతి గదుల స్లాబ్‌లో ఇనుప చువ్వలు తేలాయి. లీకేజీలు, గోడలకు పగుళ్లు, నీటి చెమ్మలతో శిథిలావస్థకు చేరింది. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు జూలై 21న ఆర్‌అండ్‌బీ ఈఈ బాలప్రసాద్ (ప్రస్తుతం బదిలీ అయ్యారు) కళాశాలను సందర్శించారు. భవనం, తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతుల నిర్వహణకు భవనం పనికిరాదని విద్యాశాఖకు నివేదిక ఇచ్చారు. నేల స్వభావం భవనంపై ప్రభావం పడి ఉండవచ్చని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.



పగుళ్లు పట్టిన తరగతి గదుల గోడలు



చువ్వలు తేలిన తరగతి గది స్లాబ్



తరగతి గదిలో గోడలకు ఏర్పడిన పగుళ్లను చూపుతున్న ప్రిన్సిపాల్

ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత?

కళాశాల నిర్వహణకు భవనం పనికిరాదని ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదిక ఇచ్చినా మరో చోటకు తరలించకుండా ఇంటర్ విద్యాశాఖ చోద్యం చూస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారనే ఆలోచన అధికారులు చేయకపోవడం గమనార్హం

250 మంది విద్యార్థులు

కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతో పాటు కంప్యూటర్ సైన్స్, ఈటీ, డెయిరీ టెక్నాలజీ వృత్తివిద్య కోర్సులు బోధిస్తున్నారు. ఆలేరు, కొలనుపాక, రఘునాథపురం, దూదివెంకటాపురం, చిన్నకందుకూరు, శారాజీపేట, కొల్లూరు, ఇక్కుర్తి, అమ్మనబోలు, మంతపురి, శ్రీనివాసపురం, మోటకొండూరు తదితర గ్రామాలకు చెందిన 250 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అదే విధంగా బోధన, బోధనేతర సిబ్బంది 29మంది ఉన్నారు.

భయంగా ఉంది



భవనం శిథిలమైంది. తరగతి గదుల గోడలు పెచ్చులూడుతున్నాయి. వర్షాలకు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. తరగతి గదిలో ఉన్నంత సేపు విద్యార్థులంతా భయపడుతున్నారు.

– ఎం. రేఖ, విద్యార్థిని, దూదివెంకటాపురం

గోడలకు పగుళ్లొచ్చాయి



అన్ని తరగతి గదుల్లో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. లీకేజీలు ఉన్నాయి. వర్షం వస్తే గదులు కురుస్తాయి. అప్పుడప్పుడు పైకప్పు పెచ్చులూడిపడతాయి. ఇబ్బందులతోపాటు భయంతో గడుపుతున్నాం.

– జె. మణిధర్, విద్యార్థి, అమ్మనబోలు

కళాశాలను తరలించేందుకు ప్రతిపాదనలు



ఆర్‌అండ్‌బీ నివేదికను ఇంటర్ విద్యాశాఖ అధికారులకు అందజేశాం. తప్పని పరిస్థితుల్లో.. కాస్తా బాగున్న గదుల్లో తరగతులు కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోకి జూనియర్ కాలేజీని తరలించే ప్రతిపాదనలను అధికారులు పరిశీలిస్తున్నారు.

– పూజారి వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

• భక్తుల సందడి



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం ఆరగింపు సమయంలో క్యూలైన్‌లలో వేచి ఉన్న భక్తులు

- యాదగిరిగుట్ట

క్లుప్తంగా

స్కూటీని ఢీకొన్న ట్రాక్టర్.. బాలిక మృతి

గుర్రంపోడు : స్కూటీని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బాలిక మృతిచెందింది. ఈ ఘటన గుర్రంపోడు మండలంలోని లక్ష్మీదేవిగూడెం స్టేజీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కొండమల్లేపల్లి మండలం చినఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన కూర రాధ, కూర వెంకటయ్య దంపతులు. వీరికి పౌర్ణమి కుమార్తె ఉంది. వెంకటయ్య గ్రామంలోనే వ్యవసాయం చేస్తుంటాడు. రాధ నల్లగొండలోని హాస్టల్‌లో వంట పనులు చేస్తూ కుమార్తె కూర పౌర్ణమి(16)తో కలిసి నల్లగొండలో నివాసం ఉంటుంది. గుర్రంపోడులో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి రాధ తన కుమార్తె పౌర్ణమితో స్కూటీపై వెళ్లి వస్తోంది. ఈక్రమంలో లక్ష్మీదేవిగూడెం స్టేజీ వద్ద వీరి స్కూటీని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న పౌర్ణమి మృతిచెందింది. రాధ తీవ్ర గాయాలతో నల్లగొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెద్దవూర: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పానుగోటి సంపత్‌రావు (86) అనారోగ్యం సమస్యతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

రాజాపేట : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది మల్లేశంకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు గడ్డమీది రాజు (25) వ్యవసాయం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం 6గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. తండ్రి మల్లేశం తెల్లవారుజామున 5గంటలకు తన వ్యవసాయ బావివద్దకు వెళ్లి చూడగా పశువుల కొట్టంలో మంచంపై పడి ఉన్నాడు. ట్రాక్టర్ ఫైనాన్స్‌తోపాటు మరికొన్ని అప్పులు ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదు ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

పులిచింతల ప్రాజెక్టుకు 21,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు వరద నీరు భారీ వచ్చి చేరడంతో ఆదివారం రాత్రి వరకు ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 21,338 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా అవుట్ ఫ్లో 19,000 క్యూసెక్కులు ఉందని పేర్కొన్నారు. 19,000 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సాగర్‌కు పర్యాటకుల తాకిడి

- సుమారు ఐదు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- మధ్యాహ్నం సమయానికి గేట్లు మూసివేయడంతో నిరాశతో వెనుదిరిగిన పర్యాటకులు


లాంచీ వద్ద కిక్కిరిసిన పర్యాటకులు

నాగార్జునసాగర్: కృష్ణమ్మ పరవళ్లను చూసేందుకు నాగార్జునసాగర్‌కు పర్యాటకులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులతో కిటకిటలాడింది. బుద్ధవనం నుంచి సాగర్‌డ్యాం దిగువనగల విద్యుదుత్పాదన కేంద్రం నుంచి రేడియల్ క్రస్ట్‌గేట్ల వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కొత్త బ్రిడ్జి, విజయ విహార్, లాంచీస్టేషన్, బుద్ధవనం, పైలాన్‌లోని గ్యాలరీల రోడ్లు, పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, బ్యాంకు పార్కు, పైలాన్ శంకుస్థాపన పిల్లర్ నుంచి బస్టాండు మీదుగా జెన్‌కో కార్యాలయం వరకు జనంతో కిటకిట లాడింది. బుద్ధవనం పరిసరాలు, పార్కులు, విజయవిహార్ వెనుక భాగం పార్కులో పర్యాటకులు భోజనాలు చేసి సేద తీరారు. లాంచీ విహారం చేసేందుకు సరిపోయేటన్ని లాంచీలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లాంచీ టికెట్లు దొరకని పరిస్థితి నెలకొంది. వాహనాల రద్దీ ఉండడంతో కొత్తబ్రిడ్జితోపాటు ఇటు ముత్యాలమ్మ గుడి వరకు వేరే రూట్లలో ట్రాఫిక్‌ను మళ్లించారు.


నదీతీరం వద్ద ట్రాఫిక్ జామ్


పార్కులో సేదదీరుతున్న పర్యాటకులు

నిరాశలో పర్యాటకులు

ఆదివారం ఉదయం 14 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే వరద తగ్గడంతో గేట్లను ఒక్కొక్కటిగా మూసివేస్తూ వచ్చారు. మధ్యాహ్నానికి గేట్లు పూర్తిగా మూసివేయడంతో పర్యాటకులు నిరాశకు గురయ్యారు.

నీటి విడుదలకు 58 ఏళ్లు


- 1967 ఆగస్టు 4న సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేసిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ


ఎడమకాల్వకు నీటిని విడుదల చేసిన అనంతరం పరిశీలిస్తున్న ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాల్వలకు నీటిని విడుదల చేసి నేటికి 58 ఏళ్లు పూర్తయ్యాయి. కృష్ణానదిపై నిర్మించిన బహుళార్థకసాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ మానవనిర్మిత ఆనకట్టల్లో ప్రపంచంలోనే అతిపెద్దది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసి, నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. 1955 డిసెంబర్ 10 నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా 12 సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఆనాడు రైతుల కళ్లలో ఆనందం తొనికిసలాడింది. కాల్వల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండాయి. రైతులు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదవ లేకుండా పోయింది. ఆయకట్టుపరిధిలోని గ్రామాలు పట్టణాలుగా మారాయి. మిర్యాలగూడ,కోదాడ,ఖమ్మం లాంటి చిన్న చిన్నగ్రామాలు నేడు పెద్ద,పెద్ద పట్టణాలుగా రూపుదిద్దుకున్నాయి. హాలియా, నేరెడుచర్ల, హుజూర్‌నగర్ లాంటి పల్లెలు నేడు ఆర్థికంగా, వ్యాపారపరంగా అభివృద్ధిపథంలో ఉన్నాయి. జనాభాపెరిగిన మేజర్‌గ్రామ పంచాయతీలు పురపాలక సంఘం నగరాలుగా మారాయి.

ఆశించిన మేర నెరవేరని లక్ష్యం

58 ఏళ్లు గడిచినా అనుకున్న స్థాయిలో ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టు ఆధునీకరణలో కొన్ని ప్రాంతాలకు నీరు చేరువైనప్పటికీ మరికొన్ని ప్రాంతాల్లోని కాలువల చివరి భూములకు నేటికి నీరందడం లేదు. ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న భూములు బీడు భూములుగానే ఉంటున్నాయి. ముందు చూపును దృష్టిలో పెట్టుకుని జలాశయం నుంచి నీటిని అదనంగా తీసుకునే అవకాశం ఉండే విధంగా కాలువ వెడల్పుగా తవ్వలేదు. మెయిన్ కాల్వ హెడ్ రెగ్యులేటర్ నుంచి డిస్ట్రిబ్యూటరీల హెడ్ రెగ్యులేటర్ల వరకు, తూములు వెడల్పు చేసి ఇన్‌టెక్ లెవల్‌ను పెంచుకునే అవకాశం లేకుండా పోయింది. ఆనాడు స్థిరీకరణలో తేలని భూములు నేడు సేద్యంలోకి వచ్చి ఆయకట్టు పెరిగింది. ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి అంచనా వ్యయం కేవలం రూ.70కోట్లు కాగా ఆ తర్వాత మరమ్మతులకే వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయినప్పటికీ గ్యాప్ ఆయకట్టుకు (టేల్యాండ్) నీరందక పోవడంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రాజెక్టు ఆధునికీరణకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ బ్యాంకు ఆర్థికసాయంతో రూ.4,444.44 కోట్లతో ప్రణాళిక తయారుచేసి పనులు ప్రారంభించారు. అయితే సమర్థులైన అధికారులు లేకపోవడంతో 2014లో పూర్తి కావాల్సిన పనులు జూలై 2016లో ముగిసాయి. అప్పుడే కాల్వలకు గండ్లు పడటంతో పాటు లైనింగ్ రూపురేఖలు మారాయి. ఈపనులన్నీ సమర్థవంతంగా పూర్తిచేస్తే, ప్రాజెక్టు లక్ష్యం అనుకున్న స్థాయిలో నెరవేరేది. కాలువల వ్యవస్థ, పారుదల సామర్థ్యం పెరిగి గ్యాప్ ఆయకట్టు సాగులోకి వచ్చేది.


నాగార్జునసాగర్ ప్రాజెక్టు

కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం నిర్మించారు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేసి కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు: డబ్బులు, కాంట్రాక్టర్ల కోసమే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మించిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా, మేడిగడ్డ వద్ద నిర్మించారని, కాళేశ్వరంలో డిజైన్ లోపం, నిర్లక్ష్యం, అవినీతి చోటుచేసుకుందని మండిపడ్డారు. ఆదివారం చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరో విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే కాలంలో మునుగోడులోనే కంటి ఆస్పత్రి నిర్మించి ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇది సేవా కార్యక్రమమని, రాజకీయాలతో సంబంధం లేదన్నారు. అన్ని ప్రభుత్వమే చేయాలంటే కష్టమని, భగవంతుడు ఇచ్చిన శక్తి కొద్దీ సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. విద్య, వైద్యం తనకు రెండు కళ్లు అని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించే పనులు మొదలుపెట్టామని తెలిపారు. 614 మంది పాల్గొన్న ఈ శిబిరంలో 245 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి, 117 మందిని వెంటనే తరలించగా.. మిగిలిన 128 మందిని మంగళవారం తీసుకెళ్లి ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, జిల్లా నాయకులు కావలి ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్‌కు క్యూఆర్ కోడ్


యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో ఉన్న ఫ్లెక్సీ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు రింగ్ రోడ్డులో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆలయ అధికారులు భక్తులకు ఆయా మార్గాలను, ఆధ్యాత్మిక వాడలోని లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, ప్రెసిడెన్షియల్ సూట్, తులసీ కాటేజీ, తదితర ప్రాంతాలను తెలుపుతూ క్యూఆర్ కోడ్‌తో కూడిన రూట్ మ్యాప్ ఫ్లెక్సీలను కొండ పైన, కొండ కింద వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేశారు. భక్తులకు సులభతర ప్రయాణం కోసం దీనిని ఏర్పాటు చేసినట్లు ఈఓ వెంకట్రావ్ తెలిపారు.

సాగర్ ఎడమ కాల్వ కట్టకు బుంగ


నడిగూడెం మండలం సిరిపురం ఎడమకాల్వ కట్టపై పడిన బుంగ

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామ సమీపంలోని డీప్ కట్ట వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్టకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుంగ పడింది. కాల్వ కట్ట మీదుగా ప్రవహించిన వర్షపు నీరు కాల్వలోకి బుంగ ద్వారా చేరుతోంది. కట్ట కింద భాగంలో బుంగ పడడంతో భవిష్యత్‌లో కట్ట తెగే ప్రమాదం ఉంది. రైతుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారే అవకాశముందని సిరిపురం, చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాల రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బుంగను పూడ్చి వేయాలని కోరుతున్నారు.

సాగు నీరు అందించడంలో పాలకులు విఫలం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి : శ్రీశైలం, నాగర్జునసాగర్ ప్రాజెక్టుల గేట్ల ద్వారా నీరు విడుదలవుతున్నప్పటికీ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం అవగాహన లేకుండా నల్లగొండ జిల్లాను ఎండబెడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. ఆదివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప కాల్వల ద్వారా పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీరందించలేకపోతున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ముందు చూపు లేకే ఈపరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీజన్‌లో నీరందక నల్లగొండ జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నకిరేకల్ నియోజవర్గంలో విచ్చలవిడిగా ఇసుక దందా నడుస్తున్నా అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు గుర్రం గణేష్, గోలీ వేణు, మాధవరెడ్డి, కొండ సైదులు, వంటల చేతన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బీభత్సం

- వాహనదారులు, పాదచారులపైకి దూసుకువచ్చిన లారీ
- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు


ప్రమాదానికి కారణమైన లారీ

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో లారీ బీభత్సం సృష్టించింది. జగదేవ్‌పూర్ రోడ్డు మార్గం నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ వేగంగా దూసుకురావడంతో ఇద్దరు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిలమామిడి రామకృష్ణ(35), చిలమామిడి సాయి కుమార్(22) హైదరాబాద్‌లోని సూరారం కాలనీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. రామకృష్ణ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా, సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌లో నిశ్చితార్థం వేడుకకు బంధువులతో కలిసి వచ్చారు. నిశ్చితార్థం జరుగుతున్న క్రమంలో స్వీట్స్ కోసం రామకృష్ణ, సాయికుమార్ ఇద్దరూ కారులో పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాకు బయలుదేరారు. కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేసి షాపు దగ్గరకు వెళ్తున్నారు. ఇదే సమయంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీ ఉత్తరప్రదేశ్ నుంచి జగదేవ్‌పూర్ రోడ్డు మార్గం నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ వేగంగా దూసుకువచ్చి అక్కడే ఉన్న పాదచారులు, ద్విచక్రవాహనదారులను ఢీకొట్టింది. దీంతో అక్కడే నిలబడి ఉన్న రామకృష్ణ మృతి చెందగా, సాయికుమార్‌తో పాటు రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన బీమారి శివసాయికుమార్, లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సాయికుమార్‌తో పాటు శివకుమార్‌ను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సాయికుమార్ మృతి చెందాడు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. మృతుడు రామకృష్ణకు భార్య ఇద్దరు కుమార్తెలు, సాయికుమార్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.


రామకృష్ణ (ఫైల్)


సాయికుమార్ (ఫైల్)

ధ్వంసమైన షాపులు, బైకులు

లారీ వేగంగా దూసుకురావడంతో రోడ్డు పక్కన ఉన్న టీ స్టాల్, పాన్ షాప్‌లు, అక్కడే ఉన్న మూడు బైకులు ధ్వంసమయ్యాయి. మృతుడు లారీ, గోడ మధ్యన ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్న ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న చండూరు సీఐ ఆదిరెడ్డి

నల్లగొండ: వాహనాల్లో బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని కనగల్ పోలీసులు అరెస్టు చేసినట్లు చండూరు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. కేసు వివరాలను ఆదివారం కనగల్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. కనగల్ మండల పరిధిలోని కేబీ తండా గ్రామానికి చెందిన కోమటిరెడ్డి కరుణాకర్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రం వద్ద తన మోటార్ సైకిల్‌ను పార్క్ చేశాడు. వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను చోరీ చేశారు. దీంతో కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం పోలీసులు కనగల్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వీరిని చూసి వాహనం వెనుకకు తిప్పుకుని వెళ్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితులు నేరం అంగీకరించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బైక్, రూ.లక్షా 45 వేలు విలువ చేసే 20 బ్యాటరీలు, రూ. 24 వేలు నగదు, ఆటో, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సముద్రాల కృష్ణ నల్లగొండలో ఉంటూ కూలి పని చేస్తుంటాడని, మరో నిందితుడు షేక్ టిప్పు సుల్తాన్ అలియాస్ సుల్తాన్ నల్లగొండలో ఉంటూ హౌస్ షిఫ్టింగ్ మూవర్, ప్యాకర్‌గా పని చేస్తాడని పోలీసులు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. కేసును ఛేదించిన సబ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ రెడ్డి, పోలీసు సిబ్బంది రవీందర్‌రెడ్డి, వెంకన్న, శేఖర్, సురేశ్, రమేష్, వెంకట్ రెడ్డిని చండూరు సీఐ ఆదిరెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

సూర్యాపేట : సూర్యాపేటలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. రాయినిగూడెం గ్రామానికి చెందిన గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (50) ఆదివారం సూర్యాపేట శివారులోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తన సమీప బంధువు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా ఈయన బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాస్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలువలోకి దూసుకెళ్లిన సిమెంట్ ట్యాంకర్

అర్వపల్లి: నకిరేకల్– తానంచర్ల 365 హైవేపై అర్వపల్లి శివారులో తుంగతుర్తి రోడ్డు వెంట ఎస్సారెస్పీ కాలువలోకి ఆదివారం సిమెంట్ ట్యాంకర్ దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి అర్వపల్లి మీదుగా భద్రాచలం వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ సీతారాంపురం సమీపంలో రోడ్డు కల్వర్టును ఢీకొని కాలువలోకి వెళ్లింది. ట్యాంకర్ డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న వారు బయటకు దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అయతే డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

మత్స్యగిరి ఆలయ సమీపంలో యాచకుడు మృతి

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో యాచకుడు మృతి చెందాడు. మత్స్యగిరి ఆలయ సమీపంలో లింగస్వామి అనే వృద్ధుడు(65) కొంత కాలంగా యాచకుడిగా కొండపైన జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం యాగశాల వద్ద మృతి చెంది ఉండగా.. గమనించిన సిబ్బంది ధర్మకర్తల మండల చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డికి చెప్పారు. ఈ విషయాన్ని ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి


శ్రీస్వామి దర్శనం కోసం ఆలయ ముఖ మండప క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి 45నిమిషాల సమయం పట్టింది. భక్తులు అధికంగా రావడంతో ఆలయ మాడ వీధులు, క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి కనిపించింది. శ్రీస్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.44,57,014 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

ప్రతి భక్తుడికి 30గ్రాములకు తగ్గకుండా ప్రసాదం


పశ్చిమ రాజగోపురం మార్గంలో ప్రసాద వితరణను పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం 30 గ్రాములకు తగ్గకుండా అందించాలని ఈఓ వెంకట్రావ్ ప్రసాద విక్రయ విభాగం అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రసాద వితరణను ఆయన పరిశీలించారు. ఆలయ భద్రతకు సంబంధించి ఆలయ లోపలి భాగం, ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టంగా చేయాలన్నారు. ఆలయంపై డ్రోన్స్ ఎగురకుండా నిషేధించుటకు భద్రత సిబ్బందికి అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. శ్రీస్వామి వారి దర్శనం అనంతరం భక్తులను పశ్చిమ రాజగోపురం నుంచి (ప్రసాద వితరణ మార్గంలో) మాత్రమే బయటకు అనుమతించాలని పేర్కొన్నారు.

మినీ శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి చెరువు సమీపంలోని మినీ శిల్పారామంలో ఆదివారం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. యాదగిరీశుడి సన్నిధికి వచ్చిన భక్తులు తిరుగుపయనంలో మినీ శిల్పారామాన్ని సందర్శించి నృత్య ప్రదర్శన తిలకించారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని పలు దుకాణాల్లో ఆదివారం పోలీసుల తనిఖీలు చేశారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను, విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.